# నా పాఠశాలలో వినూత్న కార్యక్రమాలు

## Innovative Activities in Our School


**రచయిత**

యానాల వెంకట్ రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ (రిటైర్డ్) & ఎస్.ఆర్.జి.,
సూర్యాపేట జిల్లా.

**ఎడిటింగ్**

డా. ఎస్. సురేష్ బాబు, కన్సల్టెంట్, స్కూల్ లీడర్షిప్ అకాడమీ,
ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబాద్.



స్కూల్ లీడర్షిప్ అకాడమీ
ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ,
హైదరాబాద్.

నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్షిప్,
ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NCSL-NIEPA),
న్యూఢిల్లీ.

# నా పాఠశాలలో వినూత్న కార్యక్రమాలు

## పరిచయం

బడి ఈడు పిల్లలు బడిలో చేరడం - చట్టం.

చేరిన పిల్లలు రోజు హాజరుకావడం - ధర్మం.

హాజరైన పిల్లలకు తరగతి సామర్థ్యాలు ఉండడం - న్యాయం.

ప్రస్తుతం కనీస తరగతి సామర్థ్యాలు లేకపోవడం - వాస్తవం.

పాఠశాలలు చట్టాన్ని అమలుపరచినప్పటికీ న్యాయంగా ఆ పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు సాధించకపోవడానికి కారణం ధర్మంగా వారు పాఠశాలకు హాజరు కాకపోవడం, హాజరైనా పాఠశాల కార్యక్రమాలు ఆకర్షణాత్మకంగా లేకపోవడం వలన ఇష్టంతో ఆ కార్యక్రమాలలో పాల్గొనడం లేదు. తరగతి గది కార్యక్రమాలు వారి స్థాయికి అనుకూలంగా, సామర్థ్యానికి తగినట్లుగా, ఆలోచనలకు స్థానం కల్పించేలా లేకపోవడం వలన, నూతనత్వం లేకపోవడం వలన పిల్లలు మొక్కుబడిగా ఆయా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఎక్కడో లోపం జరుగుతుంది? ఆ లోపాన్ని సరిదిద్దడం కోసం పాఠశాలలో వినూత్న కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

## లక్ష్యాలు

1. పాఠశాల కార్యక్రమాలు పిల్లలను పాఠశాల ఆకర్షించేలా ఉండడం.
2. కార్యక్రమాలు నిత్యనూతనంగా ఆసక్తి కలిగించేలా ఉండడం.
3. పిల్లల ఇష్టాలకు అనుకూలంగా కార్యక్రమాలు ఉండడం.
4. పిల్లల స్థాయికి తగినట్టు బాధ్యతలు తీసుకునేలా కార్యక్రమాలు ఉండడం.
5. పిల్లలకు పని పట్ల గౌరవం పెంపొందింపజేయడం.
6. పిల్లల ప్రతిభా పాఠవాలను, సామర్థ్యాలను అభినందించడం.
7. పిల్లలందరిని కార్యక్రమాలలో భాగస్వాములను చేయడం.

## విద్యార్థులకు సమగ్రాభివృద్ధికి మనమేమి చేయాలి?

పిల్లల సమగ్రాభివృద్ధి పాఠశాల బాధ్యత. పాఠశాలకు దిక్సూచి లాంటి వారు ప్రధానోపాధ్యాయులు. వారి మార్గదర్శనంలో పిల్లల సమగ్రాభివృద్ధి జరగాలి. పిల్లలు బడికి రావడం, ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం, పిల్లలు బట్టీ పట్టడం, పరీక్షలలో రాయడం మార్కులు తెచ్చుకోవడం, పై తరగతికి వెళ్ళడం, ప్రతి తరగతిలో ఇదే తంతు జరిగితే సమగ్రాభివృద్ధి జరిగిందని చెప్పగలమా? పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, భావావేశ, జ్ఞానాత్మక రంగాలలో అభివృద్ధి చెందారని చెప్పగలమా? వారు 'జీవన నైపుణ్యాలు' పొందారని నిర్ధారించగలమా?

పాఠ్యాంశ భోధనలో పిల్లలను ఆలోచింపజేసి, నేర్చుకున్న జ్ఞానాన్ని నిజ జీవితానికి అనుసందానం చేయడం ద్వారా సమాజంలో సమస్యలను ఎదుర్కొని పరిష్కరించగలిగేలా చేయాలి. అలా జీవన నైపుణ్యాలు సాధింపజేయాలి. జీవన నైపుణ్యాలు WHO చెప్పినట్లు

1. సృజనాత్మకత (Creativity)
2. సమస్యా పరిష్కారం (Problem Solving)
3. స్వీయ అవగాహన (Self Awareness)
4. వ్యక్తంతర నైపుణ్యాలు (Interpersonal Skills)
5. ఒత్తిడిని అధిగమించడం (Stress Management)
6. నిర్ణయాలు చేయడం (Decision Making)
7. విమర్శనాత్మక ఆలోచన (Critical Thinking)
8. సహానుభూతి (Empathy)
9. భావప్రసారం (Communications)
10. భావోద్వేగాల నిర్వహణ (Management of Emotions)

ఇవి సాధించాలి అంటే భావనలు బట్టీపడితే సాధ్యం కాదు. ఎన్నో కార్యక్రమాలు పిల్లలను బాగస్వామ్యం చేసేవి పాఠశాలలో నిర్వహించబడాలి. అవి ఎప్పుడు ఒకేలా ఉండరాదు. వారికి సవాలు చేసేవిగా ఉండాలి. అందుకై వివిధ వినూత్న కార్యక్రమాలు ప్రతి సందర్భంలో నిర్వహించాలి. ఇందుకు ప్రధానోపాధ్యాయులు శ్రీకారం చుట్టాలి.

## బాలల సంఘాలు

పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి, కలిసి పని చేయడం, ఇతరులకు సహకరించడం, నిబద్ధతతో, నియమాలు పాటిస్తూ ఉండడం, సమస్యలు గుర్తించడం, ప్రణాళికాబద్ధంగా వాటిని పరిష్కరించడం బాలల సంఘాల ద్వారా సాధ్యమౌతుంది. మా పాఠశాలలో గల బాలల సంఘాలు

- గ్రంథాలయ కమిటీ
- క్రమశిక్షణా కమిటీ
- ఆరోగ్య, పరిశుభ్రత కమిటీ
- సాంస్కృతిక కమిటీ
- ఆటల కమిటీ

## 1. క్రమశిక్షణ కమిటీ

ప్రార్థన నిర్వహించడం, నియమాలు పాటిస్తూ ప్రార్థన నిర్వహించడం, హాజరు, వరుసలో నిలబెట్టడం మధ్యాహ్న భోజన సమయం, స్వల్ప విరామంలో అందరికి సూచనలు ఇవ్వడం, వడ్డించడం, నీటి సరఫరా చూడడం, పాఠశాలలో జరిగే అన్ని కార్యక్రమాలు వీరి ప్రణాళికతోనే జరుగుతాయి. నిజాయితీ పెట్టెను, పోస్టుబాక్సును నిర్వహిస్తారు.

## 2. గ్రంథాలయ కమిటీ

పుస్తకాల సేకరణ, రికార్డు చేయడం ఇచ్చిపుచ్చుకోవడం, అట్టలు వేయడం, గోడపత్రిక నిర్వహించడం, వాటి నుండి పుస్తకాలను రూపొందించడం, పుస్తకాలకు అట్టలు వేయడం, పాఠశాల పత్రికను నిర్వహించడం వీరి బాధ్యత.

## 3. ఆరోగ్య పరిశుభ్రత కమిటీ

పాఠశాలలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు. పిల్లల జుట్టు, బట్టలు, స్నానం, యూనిఫార్మ్, ఇతర అంశాలు ప్రార్థనా సమయంలోనే పరిశీలించి సూచనలు చేయడం, పాఠశాలను, తరగతిగదులను పరిశుభ్రంగా ఉంచడం, పారిశుధ్యం, మధ్యాహ్న భోజన పరిశీలన వీరి బాధ్యత. పచ్చదన కార్యక్రమం, చెట్లకు నీళ్ళు పోయడం, పండుగల సందర్భంగా పాఠశాల అలంకరణ వీరి బాధ్యత.

## 4. సాంస్కృతిక కమిటీ

పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వీరి బాధ్యత. క్విజ్, పాఠశాలలో డ్రాయింగ్ పోటీలు / చిత్ర లేఖనం, హాస్య కథల నిర్వహణ కూడా వీరి బాధ్యతే. జాతీయ నాయకుల జయంతి-వర్ధంతి, జాతీయ పండుగలలో సాంస్కృతిక కార్యక్రమాలు / పోటీల నిర్వహణ వీరి అదనపు బాధ్యత.

## 5. ఆటల కమిటీ

పిల్లలందరూ ఆటలలో పాల్గొనేలా ప్రోత్సహించడం, ఆట వస్తువుల పరిరక్షణ, క్రీడాస్థలం, క్రీడల నిర్వహణ వీరి బాధ్యత. డ్రిల్ నిర్వహించడం, మార్చ్‌ఫాస్ట్ నిర్వహించడం, ప్రార్థనలో డ్రమ్స్, మైక్‌సెట్ నిర్వహణ కూడా వీరి బాధ్యత.

## 6. రీడింగ్ క్లబ్ (Reading Club)

పిల్లలను స్వతంత్ర పాఠకులుగా ఎదగనీయాలి. అందుకోసం పాఠశాలలో రీడింగ్ క్లబ్బులు ఏర్పాటు చేయాలి. ప్రతి తరగతి నుండి ఇద్దరు సభ్యులు ఉంటారు. పిల్లలచే గ్రంథాలయంలోని పుస్తకాలను చదివిస్తారు. వారిని సొంత మాటలలో చెప్పమంటారు. సొంత వాక్యాలలో రాయమంటారు. పుస్తకంలోని మంచి, చెడుల గురించి అభిప్రాయాలు పంచుకుంటారు.

## 7. సేఫ్టీ క్లబ్ (Safety Club)

పిల్లల రక్షణ కొరకు ఏర్పాటు చేసే క్లబ్. దీనిలో అమ్మాయిలు, అబ్బాయిలు ప్రతి తరగతి నుండి ఉంటారు. వీరు తరగతిలోని పిల్లలకు జరిగే అవమానాలు, లైంగిక వేధింపుల గురించి తెలుసుకోవడం, ప్రధానోపాధ్యాయులకు తెలియజేయడం. అవసరమైతే తల్లిదండ్రులకు తెలియజేయడం చేస్తారు. షీ టీమ్స్, ఇతర కౌన్సిలింగ్ తరగతులను ఏర్పాటు చేస్తారు. అవగాహన కల్పిస్తారు.

## 8. కమ్యూనిటీ క్లబ్ (Community Club)

4-5 మందితో పాఠశాలలో కమిటీ వేస్తారు. పాఠశాలలోని సమస్యలు, సమాజంలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను కమ్యూనిటీ దృష్టికి తీసుకొనిపోతారు. ధైర్యంగా మాట్లాడగలిగేవారు,

విషయాలను స్పష్టంగా చెప్పగలిగేవారు ఇందులో సభ్యులుగా ఉంటారు. అవసరమైతే గ్రామ పంచాయతీ సమావేశాలకు హాజరై సమస్యలు విన్నవిస్తారు.

పై 8 బాలల సంఘాలు ప్రతి నెలకొకసారి కలుసుకొని సమీక్ష చేస్తారు. రాబోయే నెలకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రణాళికను రూపొందిస్తారు.

**కార్యక్రమాలు**

1) 1. ప్రార్థనకు ముందు పాఠశాలలో 5 నల్లబల్లలు గోడలకు రూపొందించి a) నేటి చిత్రం, b) నేటి సూక్తి, c) నేటి వార్తలు, d) నేటి ప్రశ్న, e) పుట్టిన రోజు గల విద్యార్థులు/ ఉపాధ్యాయులు పేర్లు రాస్తారు.

2) **ప్రార్థనలో:** నేటి వార్తలు, నేటి ప్రత్యేకత, నేటి సూక్తి, నేటి ప్రశ్న, చెప్పే జవాబును Answer boxలో వేయమంటారు. పుట్టిన రోజు గల విద్యార్థులను/ ఉపాధ్యాయులను పిలిచి శుభాకాంక్షలు తెలుపుతారు. క్రమశిక్షణ కమిటీ హాజరు తీసుకుంటుంది (మొత్తం తరగతికి). ఆరోగ్య కమిటీ పిల్లల బట్టలు, స్నానం, గోర్లు, జుట్టు పరిశీలిస్తారు.

3) **గోడపత్రిక:** పిల్లలు రాసిన కథలు, బొమ్మలు, జోక్స్, కార్టూన్స్, గేయాలు మొదలైనవి గోడపత్రికపై అతికిస్తారు. వాటిన పక్షానికి ఒకసారి తొలగించి వాటిని పుస్తక రూపంలో కుట్టి పక్షపత్రికగా తయారుచేసి గ్రంథాలయంలో ఉంచుతారు. పిల్లల చదువుకోవడానికి ఉపయోగపడుతుంది.

4) **Question Box:** ఇది పాఠశాల ఆవరణలో బాక్స్ ఏర్పాటు చేస్తారు. పిల్లలకు కలిగిన అనుమానాలు, ప్రశ్నలకు జవాబులు, ఇతర సమాచారం తెలుసుకొనుటకు, ఉత్తరాలు సమస్యలపై రాసి అందులో వేస్తారు. వాటికి జవాబులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీర్చుతారు. ప్రార్థనలో గాని సమావేశాలు జరిగినప్పుడు లేదా నల్లబల్లపై రాసి పిల్లలకు అందుబాటులో ఉంచి నివృత్తి చేస్తారు.

5) **నిజాయితీ పెట్టె:** ఇది పెద్ద పెట్టె. పిల్లలందరికి అందుబాటులో ఉంటుంది. పాఠశాల ఆవరణలో దొరికిన వస్తువులు, డబ్బులు, పెన్నులు, పుస్తకాలు, ఇతరములు అందులో వేస్తారు. పోయినవాళ్ళు సాయంత్రం పెట్టె తెరచి ఉపాధ్యాయుల సమక్షంలో తీసుకుంటారు.

6) **మాస్ డ్రిల్ / యోగా / మార్చ్ ఫాస్ట్:** పిల్లల్లో శారీరక అభివృద్ధి, క్రమశిక్షణకు ప్రతి వారంలో మధ్యహ్నాం ఒక గంట దీనిని నిర్వహిస్తారు. ఇందులో మాస్‌డ్రిల్, యోగా, మార్చ్‌ఫాస్ట్, ఆటలు ఉపాధ్యాయుని ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ప్రత్యేక రోజులలో ప్రదర్శనలు చేస్తారు.

7) **గ్రంథాలయ వారోత్సవాలు:** విద్యా సంవత్సరం ప్రారంభంలో దీనిని నిర్వహిస్తారు. గ్రామంలో పిల్లలు పుస్తకాల సేకరణ చేస్తారు. గ్రామంలోని పెద్దలు, విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగుల దగ్గరకు వెళ్ళి సేకరిస్తారు. వాటికి అట్టలు వేసి, స్టాక్ బుక్‌లో రాస్తారు. వర్గీకరణ చేసి పిల్లలకు అందుబాటులో ఉంచుతారు. పిల్లలకు 'పఠనం'పై కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యాసరచన, వక్తృత్వం మొదలైనవి.

8) **పండుగలు:** పాఠశాలలో ప్రాంతీయ నాయకులు, జాతీయ నాయకుల జన్మదినాలు, వర్ధంతులు, జాతీయ పండుగలు, గ్రామ పండుగలు, అన్ని మతాలకు చెందిన పండుగలు సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. పిల్లలందరిని భాగస్వామ్యులను చేస్తారు. (బతుకమ్మ, సంక్రాంతి మొదలైనవి) మన సాంప్రదాయాలు గుర్తుచేసుకుంటారు. పెద్దల త్యాగాలను నెమరువేసుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

9) **పాఠశాల వార్షికోత్సవం:** పాఠశాల ప్రగతి, విద్యార్థుల ప్రతిభా పాఠవాల ప్రదర్శనకు సంవత్సరం చివర ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పాఠశాల పని, ఆదాయ వ్యయాల నివేదిక, పిల్లల పాఠ్య భాషాపర పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులకు పాఠశాలపై గౌరవం పెరిగేలా కార్యక్రమాలు రూపకల్పన చేస్తారు.

10) **స్వపరిపాలనా దినోత్సవం:** పిల్లల్లో dignity of labour భావన పెంపొందించడానికి, ఏ పని అయిననా నియమ, నిబంధనలతో నైపుణ్యంతో నిబద్ధతగా పని చేయాలని, బాధ్యతలు తెలుసుకునేలా చేసే కార్యక్రమమే స్వపరిపాలనా దినోత్సవం. పిల్లలే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా పాఠశాలలోని అన్ని బాధ్యతలు పంచుకొని పాఠశాలను ఒక రోజు నిర్వహించడం జరుగుతుంది.

11) **సైన్స్, మాథ్స్, భాషా దినోత్సవాలు:** బాల శాస్త్రవేత్తలుగా ప్రతి సంవత్సరం సైన్స్ దినోత్సవం నిర్వహించి ప్రయోగాల ప్రదర్శన, క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించడం, శాస్త్రజ్ఞుల గొప్పదనాన్ని తెలియజేయడం, ప్రజలకు మూఢనమ్మకాలు తొలిగేలా ప్రదర్శనలు గ్రామంలో

నిర్వహించడం. మ్యాథ్స్ డే ను నిర్వహించి, గణిత కృత్యాల ప్రదర్శన, Talent Test పెట్టి గణిత మేధావుల జీవితాలను, వారు కనుగొన్న వాటిని, వాటి ఉపయోగాలను తెల్పడం. భాషా దినోత్సవం రోజు భాషా గొప్పదనం, కథలు కవితలు, గేయాలు, వ్యాసరచన మొదలగు వాటిలో పోటీలు నిర్వహించడం, బాల కవులను తయారు చేయడమే ఉద్దేశ్యం.

12) **బుక్ బ్యాంక్:** పాఠశాల నుండి వెళ్ళిపోయే, పై తరగతికి ప్రమోట్ అయ్యే వారి నుండి పుస్తకాలు సేకరించడం, క్రింది తరగతి వారికి విద్యాసంవత్సరం చివరి రోజున ఇవ్వడం, వేసవి సెలవులలో వాటిని చదువుకోవడానికి ఉపయోగపడతాయి. పాఠశాల తెరిచిన తర్వాత కొత్తవి అన్నీ రావు. కావున వచ్చినవి ఇచ్చి, పాతవి తీసుకొని బుక్‌బ్యాంక్ ఏర్పాటు చేయడం జరుగుతుంది.

13) **సాహిత్య, సాంఘిక, ఆరోగ్య కార్యక్రమాలు:** పాఠశాలలో నెలకు ఒకసారి సాహిత్య కార్యక్రమాలు, పద్యాల పోటీ, కవితల పోటీ, శ్లోకాలు, చదివించడం చేయాలి. చూడకుండా రాయించాలి. సామాజిక అంశాల పట్ల అవగాహన కల్గించడానికి చర్చలు, గోష్ఠులు నిర్వహించాలి. సామాజిక కార్యకర్తలను భాగస్వాములుగా చేయడం, ఆరోగ్య కార్యక్రమాలు, ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, ఔషధాలు, రోగాల, వ్యాధుల (seasonal diseases) గురించి అవగాహన కల్గించడం జరుగుతుంది.

పై వినూత్న కార్యక్రమాల ద్వారా పిల్లల్లో ఉత్సాహం, పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు, సాంఘిక అభివృద్ధి, సైన్స్ పట్ల, గణితం పట్ల అభిరుచి, భాషా సామర్థ్యం పెరుగుతుంది. బడి బయట పిల్లలు పాఠశాలకు ఆకర్షితులవుతారు.

కావున ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకొని ఉపాధ్యాయులను ప్రతి బాలల సంఘానికి ఒకరికి బాధ్యత అప్పగిస్తూ సమన్వయంతో వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలి. సమాజంలోని యువకులు, తల్లులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల సహకారం తీసుకొని పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలి.

## ప్రధానోపాధ్యాయులకు సూచనలు

1. విద్యాసంవత్సరానికి ముందే ఉపాధ్యాయులతో చర్చించి వార్షిక ప్రణాళికను రూపొందించుకోవాలి.
2. ఉపాధ్యాయులకు వారికి ఆసక్తి గల కార్యక్రమాలకు బాధ్యులను చేయాలి.

3. పాఠశాలలో గల వసతులను, వనరులను పరిశీలించి చర్చించి కార్యక్రమాలు నిర్ధారించుకోవాలి.
4. కార్యక్రమాల రూపకల్పనలో పిల్లలను, సమాజాన్ని భాగస్వాములను చేయాలి.
5. సందర్భం, సమయాన్ని బట్టి కార్యక్రమాలలో మార్పులు చేర్పులు చేసుకోవాలి.
6. ఎప్పుడూ ఒక విధమైన కార్యక్రమాలు కాకుండా పిల్లల ఆసక్తులు, ఉత్సుకతలు పోకుండా ఉండేలా నూతనత్వాన్ని నింపేలా మార్పులు చేయాలి.
7. వినూత్న కార్యక్రమాలు వ్యక్తిగతమైనవి కాకుండా పాఠశాల మొత్తం కార్యక్రమంగా నిర్వహించాలి.
8. పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ ఏదో ఒక పనిలో నిమగ్నం కావాలి.
9. పైన తెలిపిన ప్రతి కార్యక్రమం ప్రతి సంవత్సరం ఇలానే నిర్వహించాలని కాకుండా అవసరానికి అనుగుణంగా మార్పులు చేస్తూ కొన్నైనా నిర్వహించాలి.

## పిల్లలకు కలిగే ప్రయోజనాలు

పై కార్యక్రమాలు పాఠశాలలో సమర్థవంతంగా నిర్వహించడం వలన పిల్లలకు కలిగే ప్రయోజనాలు:

- పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి.
- పిల్లల్లో బాధ్యత తీసుకొని పని చేసే లక్షణాలు అభివృద్ధి చెందుతాయి.
- పిల్లలు ఒక ప్రణాళికను రూపొందించుకోవడం అమలు చేయడం, జరిగిన పనిని మూల్యాంకనం చేయడం, జరిగిన పనిని మూల్యాంకనం చేయడం, తరువాత అవసరమైన మార్పులు చేయగలుగుతారు (planning – execution – evaluation).
- పిల్లల్లో ఇతరులతో కలిసి పని చేయడం, ఇతరుల సహాయం తీసుకోవడం అలవర్చుకుంటారు.
- పిల్లల్లో స్వీయ క్రమశిక్షణ అలవడుతుంది. తన వంతు వచ్చే వరకు వేచి ఉండడం, సంయమనం పాటించడం అలవడుతుంది.
- పిల్లలు నిరంతరం ఉత్సాహంగా ఉంటారు. కార్యక్రమాలలో వినూతనత్వాన్ని ప్రదర్శిస్తారు. Divergent thinking ఏర్పడుతుంది. ఆలోచనలలో వినూతనత్వాన్ని ప్రదర్శిస్తారు.
- పిల్లల్లో జీవన నైపుణ్యాలు పెరుగుతాయి. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఆందోళన చెందకుండా పరిష్కరించుకోగలుగుతారు. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోగలరు.
- మంచి ఆరోగ్యపు అలవాట్లు వస్తాయి. నిజాయితీగా ఉండడం, సందర్భోచితంగా ప్రవర్తించడం నేర్చుకుంటారు.

- వివిధ విషయాల పట్ల పూర్తి అవగాహన ఏర్పడుతుంది. తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచడం, ఇతరుల అభిప్రాయాలను వినడం, గౌరవించడం జరుగుతుంది.
- పిల్లల్లో శారీరక, మానసిక,  భావోద్వేగ అభివృద్ధి జరుగుతుంది.
- పిల్లలు సామాజిక రుగ్మతలను తెలుసుకుంటారు. వాటి పట్ల జాగ్రత్తతో వ్యవహరిస్తారు.

పిల్లల సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో వినూత్న కార్యక్రమాలను నిరంతర మార్పులను నిర్వహించి ప్రోత్సహించాలి.

## మూల్యాంకనం - కృత్యాలు

- పిల్లల్లో పఠన సామర్థ్యాన్ని పెంచడానికి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తారు?
- పిల్లల్లో సామాజిక స్పృహ కలిగించడానికి ఎలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలి?
- పిల్లల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కావడానికి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి?
- పిల్లల్లో విలువలతో కూడిన విద్యను అందించడానికి ఏ ఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు?
- బాలల సంఘాల వలన పిల్లలకు ఒనగూరే ప్రయోజనాలు ఏమిటి?
- ప్రధానోపాధ్యాయులు వినూత్న కార్యక్రమాలు పాఠశాలలో ఎందుకు నిర్వహించాలి?
- ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) చెప్పిన జీవన నైపుణ్యాలు పెంపొందించడానికి పాఠశాలలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి?